
ఆంధ్రజ్యోతి



రామచంద్రాపురం-ఘట్‌కేసర్ మార్గంలో.. ఎంఎంటీఎస్ రైలు వేళల్లో మార్పులు

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం నుంచి ఘట్‌కేసర్ మార్గంలో ఎంఎంటీఎస్ సర్వీస్ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. రోజూ సాయంత్రం 5.15 గంటలకు రాంచంద్రాపురంలో బయలుదేరే ఎంఎంటీఎస్ రైలు శనివారం నుంచి అరగంట ముందుగా 4.45 గంటలకు బయలుదేరుతుందని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.



సంగారెడ్డి కొత్త బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

సంక్రాంతికి ఇంటి బాట.. బస్టాండ్లు కిటకిట

నేటి నుంచి విద్యాసంస్థలకు సెలవులు



సంగారెడ్డిలో..

సంగారెడ్డి అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు ప్రజలంతా సొంతూళ్లకు పయనమయ్యారు. విద్యాసంస్థలకు నేటి నుంచి సంక్రాంతి సెలవులు రావడంతో విద్యార్థులు ఇంటిబాటపట్టారు. వసతిగృహాలు, గురుకులాల విద్యార్థులు సైతం తల్లిదండ్రులతో కలిసి సామగ్రితో స్వగృహానికి బయలుదేరారు. ఫలితంగా ప్రయాణికులతో సంగారెడ్డిలోని ఆర్టీసీ బస్టాండ్లు కిక్కిరిశాయి. సంక్రాంతి సెలవులు రావడంతో సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో ప్రయాణప్రాంగణాల్లో రద్దీ నెలకొన్నది. మరో వైపు తమ ఊరి బస్సు ఎప్పుడోస్తుందా అంటూ ప్రయాణికులు ఎదురుచూడటం, బస్సు రాగానే తమ సామగ్రితో ఎగబడి ఎక్కడం ఇక్కడ కనిపించింది. రద్దీ కారణంగా కొందరు ప్రయాణికులు సీటు దక్కించుకునేందుకు కిటికీల్లోంచి ఎక్కేందుకు తీవ్రంగా శ్రమించారు.



ప్రయాణికులతో కిక్కిరిసిన సంగారెడ్డి బస్టాండ్

పండుగకు ఊరెళ్తున్నారా.. జరభద్రం!

పోలీస్‌స్టేషన్‌లో సమాచారమివ్వండి

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు వెళ్లే ప్రజలు దొంగతనాల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణాల నుంచి సొంత గ్రామాలకు వెళ్లేవారు ఇళ్లల్లో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డబ్బులు ఉంచవద్దని సూచించారు. విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో గానీ, బంధువుల ఇళ్లలో కానీ భద్రపరుచుకోవాలన్నారు. ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ ఊరికి ప్రయాణం కట్టిన పరిస్థితుల్లో చుట్టుపక్కలవారికి సమాచారం ఇవ్వాలని, తెలిసినవారిని తమ ఇళ్లల్లో రాత్రివేళ పడుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీలు, ఇళ్ల పరిసరాలు, షాపింగ్ మాళ్లలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబరును సంబంధిత పోలీస్‌స్టేషన్లలో అందజేయాలని తెలిపారు. అనుమానిత వ్యక్తులను గుర్తిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వైకుంఠ ఏకాదశి వేడుకల్లో నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి బాలాజీ మందిరంలో పూజలు చేసిన టీజీఐఐసీ చైర్‌పర్సన్



సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని బాలాజీ మందిరంలో వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకున్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో శుక్రవారం జరిగిన వైకుంఠ ఏకాదశి వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న బాలాజీ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలకు హాజరైన నిర్మలా జగ్గారెడ్డికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు నాగారాజు, వెంకట్‌రాజు, కాంగ్రెస్ నాయకులు ఉదయ్‌భాస్కర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి శ్రీవైకుంఠపురంలో విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి

ముక్కోటి శోభ

- వైష్ణవాలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వార దర్శనం కోసం బారులు



సంగారెడ్డి బాలాజీ ఆలయంలో క్యూలో భక్తులు



మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం వైష్ణవాలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద క్యూ కట్టారు. తెల్లవారుజాము నుంచే స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ, అర్చనలు, విశేష పూజలు చేశారు. పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనం కల్పించారు. మెదక్ జిల్లాకేంద్రంలోని కోదండ రామాలయం, వేంకటేశ్వరాలయాల్లో భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. కోదండరామాలయంలో గోదారంగనాథ స్వామి పల్లకీసేవలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ మెంచు నగేష్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఆలయ కమిటీల చైర్మన్లు బండ నరేందర్, కంచి మధుసూదన్ పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీవైకుంఠపురంలో స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుతీరారు. ఎస్పీ చెన్నూరి రూపేష్, డీఎస్పీ సత్తయ్యగౌడ్, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్ ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. సంగారెడ్డి, జోగిపేట ఆర్డీవోలు, పలువురు సీఐలు, ప్రజాప్రతినిధులు, న్యాయాధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.



శ్రీవైకుంఠపురంలో భక్తుల సందడి





మెదక్‌లోని కోదండరామాలయంలో స్వామివారి పల్లకీసేవ, వైకుంఠ ఏకాదశి పూజల్లో పాల్గొనడానికి తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి

- ఖరారు చేసిన కాషాయ పార్టీ అధిష్ఠానం
- పారిశ్రామికవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకుడిగా గుర్తింపు
- రెండు దశాబ్దాలుగా ఎస్ఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు

7



పెద్దలు పెళ్లికి అంగీకరించలేదని.. ప్రేమజంట ఆత్మహత్య

- సింగూరు ప్రాజెక్టు సమీపంలోని హరిత రెస్టారెంట్‌లో ఘటన
- మృతులు నిజాంపేట మండల కేంద్రానికి చెందినవారు
- ఉలిక్కిపడిన పర్యాటక ప్రాంతం

6



ముగిసిన కాంక్రిట్ కానో పడవ పందేలు

- నర్సాపూర్ బీవీఆర్ఐటీలో సందడి
- నాలుగు రాష్ట్రాల కళాశాలల నుంచి 16 బృందాలు హాజరు

7

డిజిటల్ లైబ్రరీగా జోగిపేట గ్రంథాలయం

- మంత్రి చొరవతో అభివృద్ధి
- రూ. 60 లక్షలతో అదనపు భవనం
- డిజిటలైజేషన్‌కు మరో రూ. 20 లక్షలు
- రాయికోడ్, నారాయణఖేడ్, కంగ్టి, జహీరాబాద్ లైబ్రరీలకు నూతన భవనాలు



యువతకు ప్రయోజనం



జోగిపేట శాఖా గ్రంథాలయంలో మంత్రి దామోదర్ చొరవతో అదనపు అంతస్తు నిర్మాణం, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. గ్రంథాలు, పుస్తకాలను డిజిటల్ ఫార్మాట్‌లోకి మార్చడంతో యువతకు మేలు జరుగుతుంది. పోటీ పరీక్షలకు, ఉన్నత విద్యకు సిద్ధమయ్యేవారి ఉపయుక్తంగా ఉంటుంది.

-గొల్ల అంజయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

జోగిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జోగిపేటలోని శాఖా గ్రంథాలయం డిజిటల్ రూపు సంతరించుకోనుంది. మంత్రి దామోదర్ చొరవతో ఇందుకు అవసరమైన నిధులు మంజూరయ్యాయి. నిజాంకు వ్యతిరేకంగా సాగిన గ్రంథాలయోద్యమంలో భాగంగా పట్టణంలో జోగినాథాంధ్ర గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయాన్ని త్వరలోనే డిజిటలైజ్డ్ లైబ్రరీగా మారనుంది. లైబ్రరీల్లోని గ్రంథాలు, పుస్తకాలను డిజిటలైజ్ చేసే ప్రక్రియకు నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా నడుం బిగించింది. సంగారెడ్డిలోని జిల్లా గ్రంథాలయం ఇప్పటికే డిజిటల్ లైబ్రరీగా రూపుదిద్దుకుంది. జోగిపేట గ్రంథాలయ భవనం శిథిలం కావడంతో మూడేళ్ల క్రితం నూతన భవనం నిర్మించి ప్రారంభించారు. ప్రస్తుతం మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవతో డిజిటల్ లైబ్రరీగా మార్చేందుకు పూనుకున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుత భవనంపై మరో అంతస్తు నిర్మించేందుకు తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ నుంచి రూ. 60 లక్షలను మంజూరు చేయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. భవనం పూర్తవగానే డిజిటలైజేషన్ ప్రక్రియ మొదలు కానుంది. డిజిటలైజేషన్ ప్రక్రియ కోసం అదనంగా రూ. 20 లక్షల నిధులను మంత్రి మంజూరు చేయించారు. దీంతోపాటు సంగారెడ్డి జిల్లాలో మరో నాలుగు లైబ్రరీలకు మంత్రి చొరవతో నూతన భవనాలను నిర్మించనున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య తెలిపారు. జహీరాబాద్‌కు రూ. 54 లక్షలు, నారాయణఖేడ్‌కు రూ. 60 లక్షలు, కంగ్టి, రాయికోడ్‌లకు రూ.50లక్షల చొప్పున నిధులు కేటాయించినట్టు పేర్కొన్నారు.

ఖాకీల ఇష్టారాజ్యం ఇక చెల్లదు!

- ఫిర్యాదులు, సలహాల కోసం క్యూఆర్ కోడ్
- డీజీపీ పర్యవేక్షణలో ఫిర్యాదుల విభాగం



సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో క్యూఆర్ కోడ్‌ను అతికిస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పోలీసుల ఇష్టారాజ్యం ఇక నుంచి చెల్లదు. కొన్ని పోలీస్‌స్టేషన్లలో పోలీసులు ఫిర్యాదుదారుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం క్యూఆర్‌కోడ్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం అన్ని పోలీస్‌స్టేషన్‌లలో క్యూఆర్ కోడ్‌ను అతికించారు. పోలీసుల పనితీరు, ప్రజల పట్ల అవలంభిస్తున్న విధానంపై ప్రజాభిప్రాయ సేకరణ చేయడానికి క్యూఆర్ కోడ్‌ను అమలులోకి తీసుకువచ్చారు. గతంలో పోలీసు శాఖ పనితీరు, అవలంబిస్తున్న కార్యక్రమాల గురించి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఫిర్యాదుదారులకు ఫోన్లుచేసి అభిప్రాయాలను సేకరించేవారు. కానీ ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నేరుగా పోలీసుల వ్యవహార శైలి, ఎఫ్ఐఆర్ నమోదు, ఈ చాలన్, మీ సేవా దరఖాస్తులు, పాస్‌పోర్టు తదితర అంశాలపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా ఫిర్యాదులు చేయవచ్చు. ఈ క్యూఆర్ కోడ్ ద్వారా చేసిన ఫిర్యాదులను రాష్ట్ర డీజీపీ జితేందర్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడానికి, మరింత పారదర్శకంగా సేవలందించడానికి ఇది ఉపయోగపడుతుందని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు.

క్రైం కార్నర్

చావులోనూ వీడని స్నేహబంధం

- ఇద్దరు మిత్రులను లారీ రూపంలో కబలించిన మృత్యువు
- బైక్‌ను ఢీకొన్న లారీ.. ఇద్దరి మృతి


దుర్గాప్రసాద్, నాగరాజు(ఫైల్)

నర్సాపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరు చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నారు.. పెద్దయ్యాక కూడా ఇద్దరు ఒకేదగ్గర పనిచేయగా.. ఏపని ఉన్న ఇద్దరు కలిసే వెళ్లేవారు.. అలాంటి స్నేహితులను లారీ రూపంలో వచ్చిన మృత్యువు బలిగొన్న విషాదకర ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్నది. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. అల్లీపూర్ గ్రామానికి చెందిన కమ్మరి దుర్గాప్రసాద్(26), పిట్ల నాగరాజు(25) ఇద్దరు ఇంటర్ వరకు కలిసే చదువుకున్నారు. ఇద్దరూ ఓ పౌల్ట్రీ కంపెనీలో సూపర్‌వైజర్లుగా పనిచేస్తూ జీవనం సాగించారు. ఏడాది క్రితం దుర్గాప్రసాద్ మరో చోట ఉద్యోగం చూసుకుని పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం నాగరాజు పౌల్ట్రీఫాం సీడ్ కోసం హైదరాబాద్ శివారులోని కొంపల్లికి వెళ్లాల్సి రావడంతో దుర్గాప్రసాద్‌ను తీసుకుని బైక్‌పై ఉదయం వెళ్లారు. తిరిగి అక్కడి నుంచి వస్తున్న క్రమంలో మరో పది నిమిషాలైతే ఇంటికి చేరుతామని అనుకునేలోపే హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు రోడ్డుపై పడగా.. దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలైన నాగరాజును ఆసుపత్రికి తరలించేలోపే మరణించాడు. చిన్ననాటి నుంచి మిత్రులైన వారు చివరకు చావులోనూ కలిసేవెళ్లిపోవడం అందరినీ కలచి వేసింది. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దుర్గాప్రసాద్‌కు భార్య సారికతో పాటు ఓ కూతురు ఉంది. నాగరాజుకు భార్య మేఘమాలతో పాటు ఓ కూతురు ఉన్నది. కాగా, లారీ డ్రైవర్ బైకును ఢీకొట్టి అలాగే వెళ్తుండగా గమనించిన స్థానికులు వెంబడించి లారీని పట్టుకుని డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని..

ప్రేమజంట ఆత్మహత్య

సింగూరు ప్రాజెక్టు సమీపంలోని హరిత రెస్టారెంట్‌లో ఘటన


ఉదయ్‌కుమార్, రోహిత(ఫైల్)

మునిపల్లి/నారాయణఖేడ్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): తమ పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని ఓ ప్రేమజంట ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి శివారు సింగూరు ప్రాజెక్టు సమీపంలోని హరిత రెస్టారెంట్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కార్పే ఉదయ్‌కుమార్(24) మిర్చి వ్యాపారం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మంగలి రోహిత(20) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. వీరు ఏడాదిన్నర నుంచి ప్రేమించుకుంటున్నారు. విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో పెద్దలు ఏడాది క్రితం పంచాయితీ నిర్వహించారు. ఇద్దరూ కలుసుకోకూడదని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇటీవల మళ్లీ వారి కుటుంబాల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో ఎప్పటికైనా తమ ప్రేమను, పెళ్లిని ఇరు కుటుంబాల వారు ఒప్పుకోరేమోనని భావించారు. గురువారం రాత్రి ఇద్దరూ కలిసి బుసారెడ్డిపల్లి శివారులోని సింగూరు ప్రాజెక్టు సమీపంలోని హరిత రెస్టారెంట్‌కు వచ్చి గదిని అద్దెకు తీసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున రెస్టారెంట్ సిబ్బంది చూడగా, ఇద్దరూ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించారు. వెంటనే మునిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రాజేష్‌కుమార్, ఏఎస్‌ఐ ఏసయ్యలు వచ్చి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్న ఉదయ్‌కుమార్ తండ్రి రోడ్డు ప్రమాదంలో చనిపోగా, తల్లి, సోదరుడు, సోదరి ఉన్నారు. డిగ్రీ చదువుతున్న రోహిత బుధవారం తరగతులకు హాజరైంది. గురువారం కళాశాలకు రాలేదు. కుమార్తె ఇంటికి రాకపోవడంతో తండ్రి శుక్రవారం ఉదయం కళాశాలకు ఫోన్ చేసి ఆరా తీసినట్లు తెలిసింది.

ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న లారీ

భర్త మృతి, భార్యకు గాయాలు

కొండపాక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను లారీ ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలైన సంఘటన కొండపాక మండలం దుద్దెడ శివారులో కలెక్టరేట్ సమీపంలో రాజీవ్‌రహదారిపై శుక్రవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన ఎర్రవెల్లి బాలకిష్టయ్య(59) తన భార్య రేణుకతో కలిసి పని నిమిత్తం హోండా యాక్టివాపై స్వగ్రామం నుంచి సిద్దిపేట కలెక్టరేట్‌కు వస్తున్నారు. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ అతివేగంగా అజాగ్రత్తగా వస్తూ కలెక్టరేట్ ఎదుట వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టి.. బాలకిష్టయ్య పైనుంచి వెళ్లింది. తీవ్ర గాయాలపాలైన బాలకిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య రేణుకకు గాయాలయ్యాయి. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

మాసాయిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మాసాయిపేట పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. హకీంపేటకు చెందిన పత్తి కిష్టమ్మ(85) శుక్రవారం చందాయిపేటలోని తన కూతురు వద్దకు బయలుదేరింది. మాసాయిపేటకు చేరుకుని చందాయిపేట చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడింది. స్థానికులు 108 అంబులెన్స్ సమాచారం అందించి, అందులో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వెలిమెలలో ఎలాంటి భూ కుంభకోణం జరగలేదు

- కొందరు తమ స్వప్రయోజనాలకు దుష్ప్రచారం
- గ్రీన్‌మార్క్ డెవలపర్స్ న్యాయవాదులు

సంగారెడ్డి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలంలోని వెలిమెలలో ఎలాంటి భూ కుంభకోణం జరగలేదని గ్రీన్‌మార్క్ డెవలపర్స్ న్యాయవాదులు వేణుమాధవరావు, రంగారెడ్డి, ఎర్రంరెడ్డి, శ్రీనివాస ప్రసాద్‌లు తెలిపారు. సంగారెడ్డిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెలిమెల శివారులో భూ కుంభకోణం జరిగిందంటూ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. ఆ గ్రామానికి చెందిన మహిపాల్‌గౌడ్ అనే వ్యక్తి తన స్వప్రయోజనాల కోసం కొంత మంది అనుచరులతో కలిసి తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారని తెలిపారు. 85 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నట్లు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రామచంద్రాపురం మండలం వెలిమెల, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామాల సరిహద్దుల్లో భూములను తమ సంస్థ ద్వారా కొనుగోలు చేసిన మాట వాస్తవేమనన్నారు. అయితే మహిపాల్ గౌడ్ అనే వ్యక్తి చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జా చేసినట్లు గతంలో తహసీల్దార్ ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. అలాంటి వ్యక్తి తమపై ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. తమపై ఎలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న సరిహద్దుల వివాదాన్ని పరిష్కరించేందుకు అధికారులు పారదర్శకంగా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారన్నారు. అయితే కొందరు తమ సంస్థ పట్ల అధికంగా భూమి ఉన్నదని చెడు ప్రచారం చేయడం సరికాదన్నారు. వెలిమెల శివారులో బిలాదాఖలు లేదని రెవెన్యూ అధికారులు నిర్ధారించినప్పటికీ కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు.





హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ఉమ్మడి మెదక్ జిల్లా తరఫున ముగ్గు వేస్తున్న యామిని, పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవి చైతన్య



ముగ్గు వేస్తున్న సినీనటి వైష్ణవి చైతన్య

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్



ముగ్గు వేస్తున్న మహిళ

"ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగ వల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండివంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు."



పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవి చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

ఆటో ట్రాలీ వెనుక చక్రం కింద పడి
కార్మికురాలు మృతి

గుమ్మడిదల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఓ ఫ్యాక్టరీలో ఆటో ట్రాలీ వాహనం వెనుక టైర్ కింద పడి కార్మికులరాలు మృతిచెందిన సంఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన మంత్రి భాగ్య(35) గ్రామ పరిధిలో ఉన్న పారిశ్రామికవాడలోని ప్రగతిపాలీమర్ పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తున్నది. రోజులాగే శుక్రవారం పరిశ్రమకు విధులకు వెళ్లింది. ఫ్యాక్టరీలోని ఆటో ట్రాలీ రివర్స్ వస్తుండగా గమనించకపోవడంతో భాగ్య వాహనం వెనుక టైర్ కింద పడి అక్కడికి అక్కడే మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



నర్సింహులు(ఫైల్)

నంగునూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. నంగునూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జంగిటి నర్సింహులు(36) తన ఇంటి నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం రూ.5 లక్షల అప్పు చేశాడు. ఆటో సరిగ్గా నడవకపోవడంతో అప్పు తీర్చే మార్గం కనపడక మనోవేదనకు గురై తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని చనిపోయాడు. నర్సింహులు భార్య భవానీ ఫిర్యాదు మీరు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా సి.అంజిరెడ్డిని ఎంపిక చేస్తూ ఆ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురానికి చెందిన చిన్నమైల్ అంజిరెడ్డి 1966 జూన్ 18న హైదరాబాద్‌లో జన్మించారు. ఓసీ (రెడ్డి) సామాజికవర్గానికి చెందిన ఆయన డిగ్రీలో బీఏ మ్యాథ్స్ పూర్తి చేశారు. రెండు దశాబ్దాలుగా ఎస్ఆర్ ట్రస్టు ద్వారా సేవలందిస్తున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, బీజేపీ రాష్ట్ర నాయకులుగా సుపరిచితులు. 2014లో పటాన్‌చెరు నుంచి ఎమ్మెల్యేగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2024 మెదక్ ఎంపీ సీటును ఆశించారు. ఆయన సతీమణి గోదావరి ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలుగా కొనసాగుతున్నారు. కాగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించినందుకుగాను కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి అంజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

న్యాల్‌కల్‌లో 9.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత

కోహీర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో శుక్రవారం 9.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. వారం రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం కాస్త మెరుగుపడినప్పటికీ చలి తీవ్రత మాత్రం తగ్గడం లేదు. రాత్రైతే గజగజ వణికిపోతున్నారు. మధ్యాహ్నం కూడా చల్లని ఈదురుగాలలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.





గీతంలో సంక్రాంతి సంబురం

పటాన్‌చెరు రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం సంక్రాంతి ఉత్సవాలను ఆతిథ్య విభాగం, స్టూడెంట్ లైఫ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఎడ్ల బండి, సహజ పద్ధతిలో చెరుకు రసం వెలికితీత పరికరం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముగ్గుల పోటీని నిర్వహించగా, యువతీయువకులు గాలిపటాలతో సందడి చేశారు.
- పటాన్‌చెరు రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి)



పడవ పోటీలో విద్యార్థులు

బీవీఆర్ఐటీలో ముగిసిన పడవ పందేలు

నర్సాపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కాంక్రిట్ కానో ఈవెంట్ హంగామాగా కొనసాగింది. చివరిరోజైన శుక్రవారం కాలేజీలోని నీటి కుంటలో పడవ పోటీలను నిర్వహించగా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పడవను నడిపి తమ ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఆయా కాలేజీల నుంచి 16 బృందాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కాలేజీ వైస్‌చైర్మన్ రవిచంద్రన్ మాట్లాడుతూ టెక్నాలజీకి అనుగుణంగా తమ నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఈ పోటీలు దోహదపడుతాయన్నారు. ఈ పోటీల్లో బీవీఆర్ఐటీ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు మొదటి బహుమతి, బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ కళాశాల రెండవ బహుమతి, విష్ణు కాలేజీ భీమవరం(ఆంధ్రప్రదేశ్)కు చెందిన వారు మూడవ బహుమతిని గెలుపొందారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ఐటీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, హెచ్‌వోడీ కృష్ణారావు, డీజీఎం కాంతారావు, మేనేజర్లు బాపిరాజు, అశోక్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీ తొలగింపు

సంగారెడ్డి అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కల్హేర్ జడ్పీహెచ్ఎస్‌లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ)గా పనిచేస్తున్న శ్రీరాం సంగయ్యను విధుల నుంచి తొలగించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్‌పీ సంగయ్యపై గత నెల 17న పోలీసు కేసు నమోదై అరెస్టు కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయనను విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రాపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం ఎంఐజీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ శశంకర్ పేర్కొన్నారు. విద్యుత్‌నగర్ ఎంఐజీ, అన్నమయ్య ఎన్‌క్లేవ్, పాత ఎంఐజీ, మ్యాక్స్‌సొసైటీ, ఇంద్రానగర్, ఏబీ కాలనీ, తెల్లాపూర్ గ్రామ పరిసరాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

జాతీయ సమైక్యతా దినోత్సవానికి ఎంపిక

నర్సాపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతా దినోత్సవంలో పాల్గొనేందుకు నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థిని శైలజ ఎంపికయ్యారు. ఈ నెల 15 నుంచి 21 వరకు కర్ణాటకలోని గుల్బర్గ విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో శైలజతో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సురేష్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వారిని కాలేజీ ప్రిన్సిపాల్ దామోదర్‌తో పాటు అధ్యాపక బృందం శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సంగారెడ్డి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ హెచ్చరించారు. సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.

గ్రంథాలయానికి నిధులు

రేగోడు జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రేగోడులో గ్రంథాలయ భవనం నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరైనట్లు ఈడబ్ల్యూఐడీసీ డిప్యూటీ ఈఈ చారి అన్నారు. శుక్రవారం రేగోడ గ్రంథాలయ భవనం కోసం గ్రామ కంఠంలో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. టెండర్ కూడా పూర్తయినందున మంత్రి సూచన మేరకు పనులు జరుగుతాయని తెలిపారు.



మెదక్ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



వెంకటాపూర్ వెంకటాచల క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు



సంగారెడ్డి శివారులోని శ్రీ వైకుంఠపురంలో ఉత్తర ద్వార దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

వైకుంఠ శోభ

● గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

న్యూస్ నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారా దర్శనానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు దీరారు. స్వామి కల్యాణం, పల్లకీసేవ, రథోత్సవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గోవింద నామస్మరణతో ఉమ్మడి జిల్లా మెదక్, సంగారెడ్డి జిల్లాలో మార్మోగాయి. ప్రజాప్రతినిధులు, నేతలు పూజలు చేశారు.



నర్సాపూర్ : వేంకటేశ్వరస్వామి కల్యాణానికి హాజరైన భక్తులు



చక్రియాలలో లక్ష్మీఅనంతపద్మనాభ స్వామి ఆలయంలో..



అల్లాదుర్గంలో నిర్వహిస్తున్న గరుడవాహన రథోత్సవం

రూ.28.50 కోట్ల పనులకు ఆమోదం

అమీన్‌పూర్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం



అమీన్‌పూర్ మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు రూ.28.50కోట్ల నిధులను కేటాయిస్తూ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న జనావాసాలు, కొత్తకాలనీలలో మౌలిక వసతులు అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించామన్నారు. వేసవిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా కొత్తగా నిర్మించిన రెండు భారీ రిజర్వాయర్లను త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ నందారంనర్సింహగౌడ్, కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బొల్లారం మున్సిపాలిటీలో రూ. 1.50 కోట్లు..

జిన్నారం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పైపులైన్ పనుల నిర్వాహణ కోసం రూ.కోటి50లక్షల అభివృద్ధి పనులకు పాలకవర్గ సమావేశంలో ఆమోదం తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్ మంగతాయారు, ఆర్వో నర్సింహులు, అధికారులు పాల్గొన్నారు.

టేబుల్ ఎజెండా అనుమతించాలి

● మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వార్డుల సమస్యల పరిష్కారానికి అత్యవసర పనులకు గాను టేబుల్ ఎజెండాను అనుమతించాల్సిన అవసరం ఉందని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించగా వార్డులలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం క్షేత్రస్థాయిలో పరిశీలనలోకి వెళ్లినప్పుడు అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై చైర్మన్‌తో సంప్రదించి టేబుల్ ఎజెండా పెట్టుకోవాల్సి వస్తుందన్నారు. సమావేశంలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు లలిత, వనజ, కళ్యాణి, జయశ్రీ, మమత, శంషున్నీసాబేగం, మానస, లక్ష్మి, శ్రీనివాస్, శేఖర్, రాజలింగం, లక్ష్మినారాయణగౌడ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికుడిపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

సంగారెడ్డి క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రయాణికుడిపైకి బస్సు దూసుకెళ్లింది. దీంతో సదరు ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. పుల్కల్ మండలం ముదిమాణిక్యం గ్రామానికి రాములు బస్సు కోసం సంగారెడ్డి కొత్త బస్టాండ్‌లో వేచి చూస్తున్నాడు. అయితే, సింగూరుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సును డ్రైవర్ బస్టాండ్ నుంచి బయటకు తీస్తున్న క్రమంలో ప్రయాణికుడు రాములు బస్సును ఆపేందుకు వెళ్లాడు. దీంతో బస్సు ముందు భాగం చక్రాల కింద పడటంతో రాములు కాలు నుజ్జునుజ్జయి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న ప్రయాణికులు అరవడంతో డ్రైవర్ బస్సును ఆపాడు. అప్పటికే ప్రయాణికుడు రాములు కాలుకు తీవ్ర గాయమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మునిపల్లి, జనవరి10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని గురుకుల పాఠశాలలో 5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు బుదేరా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మాధవి శుక్రవారం నాడు ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతికి కామన్ ఎంట్రెన్స్ ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 1 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. .

క్రీడలతో మానసికోల్లాసం

● అదనపు ఎస్పీ సంజీవ రావు
● సీజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రీడా పోటీలు షురూ



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అదనపు ఏస్పీ సంజీవరావు

గుమ్మడిదల జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసం, శారీరక ధృడత్వానికి ఎంతో దోహదపడుతాయని అదనపు ఎస్పీ సంజీవ రావు అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సీజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఓపెన్ టు ఆల్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంట్‌ను జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ యువత క్రీడలలో రాణించే విధంగా ఇలాంటి పోటీలు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. వాలీబాల్ రంగంలో దేశానికే కెప్టెన్ హోదా పోషించిన క్రీడాకారులు కూడా గుమ్మడిదలకు వచ్చి ప్రాక్టీస్ చేసి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. మళ్లీ 30 ఏళ్ల తర్వాత ఈ పోటీలతో ఆనాటి క్రీడ పోటీల ఉత్సాహాన్ని చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ గంగా భవాని, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి, ట్రస్టు వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్ రెడ్డి, ట్రస్టు ముఖ్య సభ్యులు చిమ్ముల నరసింహరెడ్డి, దేవేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ లు కోలన్ బాల్‌రెడ్డి, కుమార్ గౌడ్, యువజన సంఘాల నాయకుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశంగౌడ్, భాస్కర్‌రెడ్డి, ఎల్లయ్య, ఉదయ్ కుమార్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, రాజేష్, మొగులయ్య మద్దుల బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

పుల్‌కల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు గ్రామంలో జరిగిన హత్యాయత్నం కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన సుంకరి రాజు, చాకలి మల్లేశం స్నేహితులు. ఈ నెల 2న మల్లేశానికి డబ్బులు అవసరం ఉండటంతో ఇతరుల వద్ద చేబదులుగా రూ.20 వేలు అప్పు అడిగాడు. అందుకు రాజు జమానతు దారుడిగా ఉండాలని కోరగా, ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ సంఘటనలో చాకలి మల్లేశం సుంకరి రాజుపై మరణాయుధంతో గొంతుపై తీవ్రంగా గాయపర్చారు. తనను ఎలాగైనా హత్య చేయాలన్న ఉద్దేశంతో మల్లేశం కత్తితో దాడి చేశారంటూ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడి చాకలి మల్లేశంను శుక్రవారం రిమాండుకు తరలించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పుల్‌కల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం తరలిస్తున్న రెండు వాహనాలను గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి గ్రామంలో ఏపీ 28టీఈ 1685 నంబరు గల డీసీఎంలోకి టీఎస్ 15యూడీ 0984 నంబరు గల మహీంద్ర వాహహంలోని బియ్యం బస్తాలను లోడ్ చేస్తున్నారు. నమ్మకమైన సమాచారం మేరకు పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తన సిబ్బందితో కలసి పట్టుకున్నారు. రెండు వాహనాల్లో పీడీఎస్ బియ్యం పట్టుబడగా 50 క్వింటాళ్లు ఉన్నట్లుగా నిర్ధారించారు. పట్టుబడిన బియ్యం బస్తాలను అదే వాహనాల్లో అందోలులోని మండల్ లెవెల్ స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపారు. వాహనాల యాజమానులపై కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వెల్దుర్తి, జనవరి10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన టంటం నవీన్‌కు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న బట్టలు, వంట సామాగ్రి, రూ. 50వేలు కాలిపోయాయని బాధితుడు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఖేడ్ ఉపాధ్యాయుడు



వినయ్‌కుమార్

నారాయణఖేడ్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనడానికి సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం ర్యాలమడుగు ఉన్నత పాఠశాల గణితం ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్ ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్‌జిల్లా జడ్చర్ల వేదికగా ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ఆయన తయారు చేసిన నమూనా ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. దీంతో ఈ నెల 21 నుంచి 26 వరకు పుదుచ్చేరిలో జరిగే దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఆయనను ఎంపిక చేశారు. వినయ్‌కుమార్‌ను ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు అభినందించారు.

తూప్రాన్‌లో ఐసీడీఎస్ బాలమేళా

తూప్రాన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలమేళా కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల ఆటలు పాటలతో కార్యక్రమం అలరించింది. కార్యక్రమానికి తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ, కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



కాంగ్రెస్ మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా భవాని



నియామక పత్రం అందుకుంటున్న అవుసుల భవాని

పెద్దశంకరంపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా పెద్దశంకరంపేటకు చెందిన అవుసుల భవాని నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మొగిలి సునీతరావు ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పటిష్టత కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోరాటయోధుడు పండగ సాయన్న

● కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్



పండగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు రూరల్, జనవరి 10 : నిజాం రజాకర్లకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేదల కడుపు నింపిన పోరాటయోధుడు పండగ సాయన్న అని నీలం మధు ముదిరాజ్ అన్నారు. వనపర్తి జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పాన్‌గల్ మండలం రాయినిపల్లి గ్రామంలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన పండగ సాయన్న విగ్రహాన్ని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ భూస్వాముల నుంచి ఆహార ధాన్యాలు దోచి పేదలకు పెట్టిన మహనీయుడని సాయన్న అని కొనియాడారు. ఆకలితో అల్లాడుతున్న గ్రామాల్లో సాయన్న వారి కడుపు నింపి పండగ వాతావరణాన్ని తీసుకొచ్చినందున ఆయనకు పండగ సాయన్న పేరు వచ్చిందన్నారు. కార్యక్రమంలో పండగ సాయన్న వారసులు యాదయ్య, నర్సింహులు పలువు నాయకులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఫిర్యాదు

కౌడిపల్లి, జనవరి (ఆంధ్రజ్యోతి) 10: అక్రమాలకు పాల్పడుతున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లను తొలగించాలని మండలంలోని వెల్మకన్నె గ్రామస్థులు డీఆర్‌డీవో అడిషనల్ పీడీ రంగాచార్యులును కోరారు. శుక్రవారం 2023-204 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీలో నిర్వహించారు. పనికి వెళ్లకున్నా పనులు చేసినట్టు సంతకాలు పెడుతూ డబ్బులు కాజేస్తున్నారని ఈ సందర్భంగా వారు ఫిర్యాదు చేశారు. ఒకరి పేరు మీద మరొకరు పనులు చేయడమే కాకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు సంతకాలు పెడుతూ డబ్బులు డ్రా చేసుకుంటున్నట్లు ఇందులో తేలింది. తనిఖీలో అవకతవకలు చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతోపాటు మెమోలు, డబ్బుల రికవరీ ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి శ్రీహరి, స్టేట్ మానిటరింగ్ అధికారి దత్తు, ప్రోగ్రాం మేనేజర్ అశోక్, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్ అరుణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో పుణ్యాదాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిచరణ్

జహీరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిచరణ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ దళారుల చేతుల్లో రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కందులకు క్వింటాలుకు రూ.7,555ను మద్దతు ధరను చెల్లిస్తూ కొనుగోలు చేస్తుందన్నారు. సత్వార్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో కందులను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మద్దతు ధరను పొందాలన్నారు.



చిన్నశంకరంపేట : భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు

సందడిగా..

న్యూస్ నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సందడి కనిపించింది. శనివారం నుంచి బడులకు పండుగ సెలవులు శుక్రవారం ముందుస్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం భోగి మంటలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు వివిధ వేషధారణలతో అలరించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పండుగ ప్రత్యేకతలను వివరించారు.



జిన్నారం : ముగ్గు వేస్తున్న చిన్నారి